క్లుప్తంగా

నేటి నుంచి ఆశా కార్యకర్తల సమ్మె

పాన్‌గల్: ఆశా కార్యకర్తలను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతోనే మళ్లీ సమ్మె చేయాల్సి వస్తుందన్నారు. ఆశా కార్యకర్తలకు రూ.18వేల వేతనం ఇవ్వడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్‌కార్డు, రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. టీబీ స్ఫుటం డబ్బాలను ఆశలతో మోపించే పనిని రద్దు చేయాలని, టీబీ లెప్రసీ వంటి తదితర పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీస్‌లో 18 డిమాండ్లను చేర్చినట్లు పేర్కొన్నారు. సమ్మెలో ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం కంభాళాపురం గ్రామానికి చెందిన రామన్‌గౌడ్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆదివారం రామన్‌గౌడ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీహరిరాజు, ఆశన్న, ఈశ్వర్, శివనారాయణ, వేముల శ్రీధర్, చందు, ఆంజనేయులు, నిరంజన్, అశోక్, శివ పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం



వనపర్తిటౌన్: జిల్లా కేంద్రానికి చెందిన పోచ రవీందర్‌రెడ్డి ఇటీవల డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, మైనార్టీ నాయకులు ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గులాం ఖాదర్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలకు గాను రవీందర్‌రెడ్డి డాక్టరేట్‌ను పొంది వనపర్తి కీర్తిని మరింత పెంచారని తెలిపారు. కార్యక్రమంలో సాదిక్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి



పెబ్బేరు రూరల్: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సర్పంచ్ నిర్మల అన్నారు. శ్రీరంగాపురం మండలం నాగరాలకు చెందిన వెంకటేశ్వరమ్మకు రూ.60వేలు, నరేందర్‌గౌడ్‌కు రూ.13,750 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అనారోగ్యం ఇతర కారణాలతో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే పేదలను సీఎంఆర్‌ఎఫ్‌తో అన్నివిధాలా ఆదుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికి బీఎస్పీ ప్రచారం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం, నార్లాపూర్ గ్రామాల్లో ఆదివారం బీఎస్పీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బంకల దాస్ మాట్లాడుతూ బీఎస్పీతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ నాయకులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు రాజశ్యామల యాగం

కొల్లాపూర్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం రాజశ్యామల యాగం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని యాగం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐదు రోజుల పాటు యాగం కొనసాగుతుందని వివరించారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



కొల్లాపూర్: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ రాజయ్య అన్నారు. స్వచ్ఛతాహి సేవ 2.0 కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లపై ఉన్న చెత్త, చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, కమిషనర్‌లు మాట్లాడుతూ స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మట్టిరోడ్డుకు మహర్దశ



బీటీగా మారనున్న అప్పారెడ్డిపల్లి–నేలబండతండా రోడ్డు

- జీటీగా మారనున్న అప్పారెడ్డిపల్లి–నేలబండతండా రోడ్డు
- 3కి.మీ. నిర్మాణానికి రూ.1.80కోట్లు మంజూరు

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లి–నేలబండతండా మట్టిరోడ్డుకు మహర్దశ పట్టింది. 3కి.మీ. మేర ఉన్న మట్టిరోడ్డు త్వరలోనే బీటీగా మారనుంది. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం సక్రమంగా లేక ప్రజలు పడుతున్న కష్టాలు తీరనున్నాయి. వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కృషితో బీటీరోడ్డు నిర్మాణానికి రూ.1.80కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణం పూర్తయితే అప్పారెడ్డిపల్లి, దేవబండతండా, నేలబండతండా ప్రజలతోపాటు భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామస్తులకు రవాణాపరంగా సౌకర్యవంతంగా మారనుంది. ప్రస్తుతం ఉన్న మట్టిరోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షాలు కురిస్తే రోడ్డు మొత్తం అధ్వానంగా మారుతోంది. ఒక్కోసారి ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. దీంతో వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు అవస్థలు పడుతున్నారు. మట్టిరోడ్డును బీటీగా మార్చేందుకు నిధులు మంజూరు కావడంపై ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ సౌకర్యంగా ఉంటుంది..



అప్పారెడ్డిపల్లి నుంచి దేవబండతండా మీదుగా నేలబండతండా వరకు బీటీరోడ్డు నిర్మాణంతో అందరికీ సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రస్తుతమున్న మట్టిరోడ్డు గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. బీటీరోడ్డు నిర్మాణం కోసం నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డికి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– అనెమోని కృష్ణవేణి, సర్పంచ్, అప్పారెడ్డిపల్లి

కంకర పరిచారు.. బీటీ మరిచారు..



అసంపూర్తిగా నిలిచిన రోడ్డు పనులు

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాల మధ్యనున్న 4కి.మీ. రోడ్డును బీటీగా మార్చేందుకు ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణ పనులను చేపట్టిన కాంట్రాక్టర్.. రోడ్డుపై కంకరపర్చి బీటీ వేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై కంకర పర్చి సంవత్సరాలు గడుస్తున్నా బీటీ వేయడంలో జాప్యం చేస్తున్నారు. దీంతో కంకర రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత ఏఈ విద్యాసాగర్‌రెడ్డిని వివరణ కోరగా, సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి బీటీ నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని హరిజనవాడ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1997–98 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 25ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులు బలరాంమూర్తి, నారాయణరెడ్డి, రాములు, వరలక్ష్మి, షమీం, ప్రకాశ్‌లను శాలువా, పూలమాలతో సన్మానించి, మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు యాదగిరి, సుమంత్, యూసుఫ్, రఫీక్, దినేష్, లక్ష్మణ్, రాజు, మల్లికార్జున్, వెంకటేష్, బాలస్వామి, ఖాదర్, నరసింహ, నసీర్, చంద్రయ్య, ఉమామహేశ్వరాచారి, వీరన్న, దేవాంజనేయులు, మధు, నయ్యూం, గఫార్, సర్దార్, శ్రీనివాసులు, పెద్ద కురుమూర్తి, చిన్న కురుమూర్తి, మాధవి, అనిత, శ్రీలేఖ, నస్రిన్, జానకి, వరలక్ష్మి, దేవకి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు సురక్షితం



పాన్‌గల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు సురక్షితమని పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవి అన్నారు. ఆదివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కిష్టాపూర్‌తండాకు చెందిన గర్భిణి కావేరికి సాధారణ కాన్పు చేశారు. అనంతరం ఆమెకు కేసీఆర్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు ప్రతినెలా పరీక్షలు చేయించుకోవడంతోపాటు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. పీహెచ్‌సీల్లో గర్భిణులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీలో ఈనెల మూడు కాన్పులు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



మూలమల్లలో కృష్ణాజలాలను తీసుకొస్తున్న యువకులు



ఖిల్లాఘనపురం మండలం మల్కిమియాన్‌పల్లిలో..

విఘ్నాలు తొలగించు.. విఘ్నేశ్వరా



అమరచింత జగన్‌వాడలో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

అమరచింత: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని కొలువుదీరిన గణనాథుడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నాలు తొలగించి విజయాలు ప్రసాదించాలని వేడుకున్నారు. పట్టణంలోని జగన్‌వాడలో కొలువుదీరిన గణనాథుడిని పలువురు నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ నాగభూషణంగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సుధారాణి, తాటికొండ రమేష్, నరాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రెండోవార్డు పోచమ్మగడ్డలో ప్రతిష్ఠించిన గణనాథుడికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీహరిరాజు, జె.ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ఊరూరా కొలువుదీరిన గణనాథుడు విశేష పూజలు అందుకుంటున్నాడు. మండలంలోని మూలమళ్లలో జైశ్రీరాం యూత్ ఆధ్వర్యంలో కృష్ణాజలాలు తీసుకొచ్చి గణనాథుడికి అభిషేకం చేశారు. అనంతరం నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నేతాజీనగర్‌లో వినాయకుడి మండపం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మల్కిమియాన్‌పల్లి ప్లాట్ల కాలనీ, అప్పారెడ్డిపల్లిలో గణనాథుడి ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువత రంగులు చల్లుకొని నృత్యాలు చేశారు. మహిళలు బొడ్డెమ్మ ఆడారు.

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని వాసవీ సేవాసమితి అధ్యక్షుడు సురేష్‌శెట్టి దర్శించుకున్నాడు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బచ్చు వెంకటేష్, భరత్, కొండ మహేష్, కిశోర్, మారం గోవిందు, శంకర్, చందు, మహేష్, కార్తీక్, హోంగార్డు మహేష్, లింగం, విక్రమ్, ప్రేంకుమార్, రమేష్, పవన్, రాజేష్ పాల్గొన్నారు.



శ్రీరంగాపురంలో..



వనపర్తిలో సురేష్‌శెట్టిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు



ఆత్మకూర్ నేతాజీనగర్‌లో..

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



బీజేపీలో చేరిన వారితో అనుజ్ఞారెడ్డి

గోపాల్‌పేట: రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి కోరారు. రేవల్లి మండలం కేశంపేట పాతతండాలో ఆదివారం పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన 300మంది బీజేపీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, అధికార ప్రతినిధి మణివర్ధన్‌సాగర్, మండల అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి, గిరిజనమోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

పెబ్బేరు రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, బీఆర్‌ఎస్ ఎన్నికల సమన్వయకర్త వంగూర్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి అన్నారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆదివారం శ్రీరామ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆపద సమయంలో అవసరమైన రక్తం దొరక్క ఎంతోమంది అవస్థలు పడుతున్నారని తెలిపారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వైస్‌చైర్మన్ కర్రెస్వామి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కుతుబుద్దీన్, శ్రీరామ యువజన సంఘం అధ్యక్షుడు గోనెల రాఘవేంద్ర, రక్తనిధి కేంద్రం కార్యకర్త లక్ష్మీపతి, శ్రీనివాసులు, లక్ష్మి, లత, రమేష్, ఇఫ్తేకార్‌అలీ పాల్గొన్నారు.

జెన్‌కో నిధులు గ్రామాభివృద్ధికే వినియోగించాలి



మాట్లాడుతున్న వినయ్‌కుమార్‌రెడ్డి

ఆత్మకూర్: దిగువ జూరాల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మాణానికి భూసేకరణ చేపట్టిన అనంతరం విడుదలైన నిధులను గ్రామాభివృద్ధికే వినియోగించాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మూలమల్ల గ్రామస్తులతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జెన్‌కో ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా గ్రామశివారులో విలువైన భూములకు నామమాత్రంగా పరిహారం చెల్లించారని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం జెన్‌కో అధికారులు గతంలో రూ.95లక్షలు విడుదల చేయగా.. రూ.23లక్షలతో విద్యుదీకరణ పనులు చేపట్టారన్నారు. మిగిలిన రూ.72లక్షలను గ్రామాభివృద్ధికే వినియోగించాలని కోరారు. నిధులను దారి మళ్లిస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో రాజశేఖర్‌రెడ్డి, మహిమూద్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



బెల్టు గ్రేడింగ్ టెస్ట్‌లో పాల్గొన్న కరాటే విద్యార్థులు

పెబ్బేరు రూరల్: కరాటేతో ఆత్మరక్షణ లభిస్తుందని టైగర్స్ కుంగ్‌ఫూ కరాటే అకాడమీ డైరెక్టర్ విజయ్ అన్నారు. మండలంలోని శాఖాపూర్ ప్రగతి విద్యాలయంలో ఆదివారం కరాటే విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో 100మంది విద్యార్థులు పాల్గొని బెల్టులు సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలబాలికలు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భీంసాగర్, ప్రిన్సిపాల్ రిజోజి, భీమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



కోడేరు: మండలంలోని మూలమడత తండాకు చెందిన 30 మంది వివిధ పార్టీల నాయకులు ఆదివారం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో బూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. ఆశీర్వదించు



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రావణమాసం ముగియడంతో భక్తులు వివిధ ప్రాంతాలకు మైసమ్మ దేవతకు కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అచ్చంపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, పెబ్బేరు, కొల్లాపూర్, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నట్లు ఎండోమెంట్ అధికారి రంగారావు తెలిపారు.

యాదవులకు ప్రాధాన్యత కల్పించాలి

భూత్పూర్: జనాభా దామాషా ప్రకారం యాదవులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైకని బాలు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో విద్యావంతులైన యాదవులతో సమావేశం నిర్వహించారు. నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామాంజనేయులు యాదవ్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య యాదవ్, ఆర్థిక కార్యదర్శిగా ధనుంజయ్ తదితరులు ఎన్నికయ్యారు. జనాభా దామాషా ప్రకారం 22 ఎమ్మెల్యేలు, 5 ఎమ్మెల్సీలు, 2 రాజ్యసభ స్థానాలు యాదవులకు కేటాయించాలని పేర్కొన్నారు. వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ యాదవ్, జిల్లా అధ్యక్షుడు అంజన్న యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దిలేటి, రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్, అడ్డాకుల సర్పంచ్ భీమన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.